## క్లుప్తంగా

### వినోద్‌కుమార్‌కు వినతి


వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్

వీణవంక: మండలంలోని బేతిగల్ గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేయించాలని కోరుతూ సర్పంచ్ మోరె సారయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గొట్టిముక్కల రవీందర్‌రావు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కరీంనగర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. బేతిగల్ ఊర చెరువు వద్ద మత్తిడి దెబ్బతిని ప్రమాదకరంగా ఉందని, బేతిగల్-కనపర్తి గ్రామాల మధ్య రోడ్డు ధ్వంసమైందని నిధులు కేటాయించి మరమ్మతు చేయాలని కోరారు. స్పందించిన వినోద్‌కుమార్ నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

**మినీ ట్యాంక్ బండ్‌గా మార్చాలి**

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ పరిధిలోని ఊర చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మార్చాలని ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి ఆదివారం బోయినపల్లి వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

### ఎస్సైకి సన్మానం


సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి

రామడుగు: రామడుగు మండల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన తోట తిరుపతిని ఆదివారం గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు కలిశారు. అనంతరం ఎస్సైని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్లు లచ్చయ్య, అనిల్‌కుమార్, బ్రహ్మచారి, మోహన్‌రావు, భవానిసురేశ్, మల్లేశం, శ్రీకాంత్‌రెడ్డి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### 'జగిత్యాల అసెంబ్లీ సీటు బీసీలకు ఇవ్వండి'

రామడుగు: జగిత్యాల ఎమ్మెల్యే సీటు బీసీలకు ఇవ్వాలని తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్య వేదిక కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు కోన్న వేణుగోపాల్‌రెడ్డి ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాజకీయ లబ్ధి కోసం బీసీల మీద కపటప్రేమ చూపిస్తూ నలభై ఏళ్లుగా అండదండగా ఉన్న రెడ్డి జాతిని అవమానించేలా మాట్లాడారని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ పైన చేసిన వ్యాఖ్యాలను ఉపసంహరించుకోవాలని రెడ్డిలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో రెడ్డీల సత్తా చూపిస్తామని హెచ్చరించారు.

### ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

జమ్మికుంట: రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్న హామీని ప్రభుత్వం నెరవేర్చాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చంద రాజు ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్యవైశ్యులలోని నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ కరీంనగర్‌లోని టవర్ సర్కిల్‌లో ఆర్యవైశ్య మహాసభ, యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో 31న ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిరసన దీక్ష నిర్వహిస్తామని తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసే వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు కొనసాగిస్తామని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. జిల్లాలోని ఆర్యవైశ్యులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

### పరామర్శ


నివాళి అర్పిస్తున్న ఓరుగంటి ఆనంద్

మానకొండూర్: మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతిచెందిన ఆరెపల్లి పోచయ్య కుటుంబ సభ్యులను రాష్ట్ర ఆహార భద్రత కమిటీ చైర్మన్ ఓరుగంటి ఆనంద్, శ్రీనివాస్‌నగర్‌లో మృతిచెందిన కూన కనకయ్య కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ ఆదివారం పరామర్శించారు.

# అధికారుల తీరుపై గరంగరం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ చిలుక రవీందర్


ఖాళీగా సర్పంచుల కుర్చీలు

- ప్రతీ సభలో సమస్యలు రాసుకోవడమే తప్పా పరిష్కరించడం లేదు
- సమస్యలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం
- సర్వసభ్య సమావేశానికి సర్పంచులు డుమ్మా

చొప్పదండి: ప్రతీ సమావేశంలో లేవనెత్తిన సమస్యలను పరిష్కరిస్తామని చెబుతున్నా అధికారులు మళ్లీ సమావేశాల వరకు పట్టించుకోకుండా గాలికొదిలేస్తున్నారని మండల పరిషత్ సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి మండల సభలో సమస్యలను రాసుకోవడమే తప్పా పరిష్కరించక పోవడంపై నిరసన తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ చిలుక రవీందర్ అధ్యక్షతన ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

– ఇన్‌చార్జి సర్వేయర్ సరిగా పనిచేయడం లేదని, సరైన కొలతలు వేయకపోవడంతో శాతిభద్రతల సమస్య తలెత్తుతోందని రాగంపేట ఎంపీటీసీ వాపోయారు. చొప్పదండి సహకార సంఘానికి భూమి కేటాయింపులోనూ నిర్లక్ష్యం జరుగుతోందని, రెవెన్యూ కార్యాలయంలో దళారులు తిష్ట వేయడంతో సామాన్యులు సమస్యలు చెప్పుకోవడానికి కూడా జంకుతున్నారని ఆరోపించారు.

- ప్రైవేటు పాఠశాలలు అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ సామాన్యుల నడ్డీ విరుస్తున్నాయని, అధికారులు ఎందుకు తనిఖీలు చేయడం లేదని ఎంపీటీసీ బత్తుల లక్ష్మినారాయణ విమర్శించారు. ప్రైవేటు పాఠశాలల ఫీజులపై చర్యలు తీసుకుంటామని ఎంపీపీ తెలిపారు.
- ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాల్లో మహిళా సంఘాలకు వచ్చిన లాభనష్టాలను బహిర్గతం చేయాలని ఎంపీటీసీ లక్ష్మినారాయణ కోరారు. తమకు కోతలు విధించి తూకం వేశారని, రైతులు వాపోతుండగా, మహిళా సంఘాల లాభాలు బయటకు రావడం లేదని ఎద్దేవా చేశారు. వివరాలు వెల్లడిస్తామని ఏపీఎం నర్మద హామీ ఇచ్చారు.
- అంగన్‌వాడీ కేంద్రాలలో జరిగే సమావేశాలకు సమాచారం అందించడం లేదని జడ్పీటీసీ మాచర్ల సౌజన్య అసహనం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్ల పనితీరుపై విచారణ జరపాలని బీజేపీ ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే తామే పర్యటిస్తామని హెచ్చరించారు. రాగంపేట అంగన్‌వాడీ భవనం మరమ్మతు చేయకపోవడం దారుణమన్నారు.
- సమీకృత హాస్టల్ భవనంలో సమస్యల పరిష్కారానికి నిధుల లేమిపై హాస్టల్ వార్డెన్ సత్యనారాయణ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. కనీస సౌకర్యాలు కల్పించేందుకు సొంత డబ్బులు వాడాల్సి వస్తోందని వాపోయారు.

**సర్పంచుల గైర్హాజరు**

మండల పరిషత్ సమావేశానికి సర్పచులు డుమ్మా కొట్టారు. సమావేశం ప్రారంభమైన గంట వరకు ఇద్దరు మాత్రమే హాజరు కాగా మధ్యలో మరొకరు వచ్చారు. మండలంలో పదిహేను మంది సర్పంచులకు ముగ్గురే హాజరు కావడం చర్చనీయాంశమైంది. మూడు నెలలకోసారి గ్రామాల్లోని సమస్యలను చర్చించే వేదికకు 80 శాతం సర్పంచులు రాకపోవడం గమనార్హం. మండల పరిషత్ సమావేశాలలో లేవనెతి న సమస్యలు, అంశాలతో పాటు తమ పనులకు సంబంధించిన బిల్లులకు పరిష్కారం లేకపోవడం కూడా సమావేశానికి వారు హాజరు కాకపోవడానికి కారణమని భావిస్తున్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ మల్లారెడ్డి, ఎంపీడీవో స్వరూప, ఎంపీవో రాజగోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయలక్ష్మి, ఎంపీటీసీలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్ సహాయంతో సాగు సులభం


డ్రోన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గరుడ డ్రోన్ మందు పిచికారీ పరికరాన్ని ఆదివారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రారంభించారు. డ్రోన్ సహాయంతో రైతులకు సాగు సులభమవుతుందని, శ్రమ తగ్గడంతో పాటు తక్కువ సమయంలో పంటలకు మందులు పిచికారీ చేయవచ్చన్నారు. బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, బూట్ల జగన్‌మోహన్, నాయకులు పరికరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ గూడెల్లి తిరుపతి, ఏవో కిరణ్మయి. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, సర్పంచ్, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షులు గూడెల్లి అంజనేయులు, తీగల మోహన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫీ, ఉప సర్పంచ్ ప్రకాష్, నాయకులు శంకర్, లక్ష్మణ్, రవి, మల్లేశం, కొమురయ్య, రైతులు పాల్గొన్నారు.

# 'మణిపూర్' నిందితులను శిక్షించాలి


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న క్రైస్తవులు

జమ్మికుంట: మణిపూర్‌లో మహిళలపై పాశవిక చర్యను నిరసిస్తూ పట్టణంలోని బెతెస్త చర్చి ఫాదర్ అశోక్ ఆధ్వర్యంలో క్రైస్తవులు కొవ్వొత్తులతో ఆదివారం నిరసన తెలిపారు. రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు నిందితులను శిక్షించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మహిళలకు రక్షణ కరువైందని, హింసలు చెలరేగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రధాని మోదీ ఇకనైనా స్పందించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



హుజూరాబాద్‌లో ర్యాలీ

హుజూరాబాద్: మణిపూర్‌లో మహిళలపై దాడికి నిరసనగా పట్టణంలో క్రైస్తవులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. మణిపూర్‌లో అల్లర్లు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. కేంద్రం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు డేవిడ్ రాజు, డానియెల్, ఎలిషా, నెల్సన్, తిమోతి, సారంగపాణి, బీఆర్ఎస్ నాయకులు వర్దిని రవీందర్‌రావు, సలీం, తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె


జమ్మికుంట: సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న కార్మికులు


వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చిగురుమామిడి: గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు యూనియన్ నాయకులు వినతిపత్రం అందించారు. ఆదివారం కరీంనగర్‌లో వినోద్ కుమార్‌ను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించామని రాష్ట్ర యూనియన్ ప్రధాన కార్యదర్శి బింగి గణేశ్ తెలిపారు. 31న జరిగే మంత్రివర్గ సమావేశంలో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని వినోద్‌కుమార్ హామీ ఇచ్చారని చెప్పారు. వెంట తెలంగాణ గ్రామపంచాయతీ కారోబార్స్ అండ్ సిబ్బంది యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్, ఉపాధ్యక్షుడు చిలుక మారుతి, సంయుక్త కార్యదర్శి సాయన్న, ఆయా జిల్లాల నాయకులు ఉన్నారు.

శంకరపట్నం: మండలంలోని జీపీ సిబ్బంది చేపట్టిన సమ్మె 25వ రోజుకు చేరింది. కేశవపట్నంలో ఆదివారం కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై గ్రామ పంచాయతీ సిబ్బంది బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. డిమాండ్లు పరిష్కరించేవరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. రోడ్డుపై వంటావార్పు నిర్వహించారు. కార్యక్రమంలో సార య్య, మల్లేశం, సురేశ్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. ఆదివారం గ్రామ పంచాయతీ కార్మికుడు, కారోబార్ ఎర్రబాటి రాజు మృతిచెందగా జీపీ కార్మికులు శ్రద్ధాంజలి ఘటించారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కొప్పుల శంకర్, రవీందర్‌రావు, సారయ్య, స్వామి, సతీష్, సంపత్, సంతోష్, సమ్మయ్య, సంజీవ్, ఉమా, వనిత పాల్గొన్నారు.


శంకరపట్నం: బతుకమ్మ ఆడుతున్న జీపీ సిబ్బంది

# వెల్మ మల్లారెడ్డికి సన్మానం


మల్లారెడ్డిని సన్మానిస్తున్న ఎంపీటీసీలు

చొప్పదండి: జాతీయ ఉత్తమ పీఏసీఎస్ అవార్డును వరుసగా మూడుసార్లు అందుకొని రికార్డు సృష్టించిన చొప్పదండి పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డిని ఆదివారం మండల పరిషత్‌లో ఎంపీటీసీలు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ చిలుక రవీందర్, ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ సింగిరెడ్డి క్రిష్ణారెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లాకు మంజూరైన జనరిక్ మందుల షాపులో మొదటిది చొప్పదండిలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య, వైస్ ఎంపీపీ మునిగాల విజయలక్ష్మి, ఎంపీటీసీలు బత్తుల లక్ష్మీనారాయణ, కూకట్ల తిరుపతి, కట్టెకోల తార, గొల్ల గట్టయ్య, ఎంపీడీవో స్వరూప, ట్రాన్స్‌కో ఏఈ భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ


సూచనలు ఇస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

ఇల్లందకుంట: ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ జీవన్‌రెడ్డి ఆదివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డుల పరిశీలించారు. ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల గూర్చి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కొత్త వ్యక్తులు సంచరిస్తే ఆరాతీయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్,సిబ్బంది పాల్గొన్నారు.

# మరమ్మతు పనులు పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామం రోడ్యాం సమీపంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయింది. ఆదివారం మరమ్మతు పనులను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరిశీలించారు. మండలంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేయాలని, వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు.

చొప్పదండి: బీఆర్ఎస్ బీసీ సెల్ చొప్పదండి పట్టణ అధ్యక్షుడిగా మావురం మహేశ్‌ను నియమించామని ఆదివారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికి ప్రచారం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు, పార్టీ నాయకులకు మహేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

### విద్యారంగాన్ని విస్మరించొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కుతాటి ప్రతాప్

హుజూరాబాద్: విద్యా రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుతాటి రాణాప్రతాప్ అన్నారు. ఆదివారం పట్టణంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. విద్యాసంస్థల్లో ఉన్న లోపాలను ప్రభుత్వానికి ఎత్తిచూపుతున్న విద్యార్థులు, నాయకులను, మీడియాను పాఠశాలల్లోకి అనుమతించొద్దంటూ విద్యాశాఖ ప్రిన్సిపాల్ శ్రీదేవసేన ఉత్తర్వులు జారీ చేయడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం శ్రీకాంత్, జిల్లా కోశాధికారి కెమ్మసారపు రవితేజ, జిల్లా నాయకులు లోకిని శివకుమార్,మోహన్,తదితరులు ఉన్నారు.

### మడిపల్లిలో మొహర్రం

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి గ్రామంలో కులమతాలకతీతంగా గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని వీధుల గుండా డప్పు చప్పుల్ల మధ్య పీరీలను ఊరేగించి నిమజ్జనం చేశారు. ఏటా ఆనందోత్సవాల మధ్య ఐక్యతతో పండుగ జరుపుకోవడం ఆనావాయితీగా వస్తోంది. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ముస్లింలు, తదితరులు పాల్గొన్నారు.

### మత్స్యకారులు, రైతులను ఆదుకోవాలి


గండిని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

శంకరపట్నం: కల్వల ప్రాజెక్టుకు గండిపడటంతో ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు, పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి గడ్డం నాగరాజు డిమాండ్ చేశారు. గండిని ఆదివారం పరిశీలించి మాట్లాడారు. రైతులకు సాగునీరందించేందుకు మరమ్మతు చేయాలని కోరారు. కార్యక్రమంలో నరేందర్, వీరార్జున్, జగ్గారెడ్డి, శివారెడ్డి, సాయితేజ, తదితరులు ఉన్నారు.

### మడిపల్లిలో వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న సీఎస్‌సీ బృందం

జమ్మికుంట: మండలంలోని మడిపల్లిలో సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్) హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో లేబర్ కార్డు కలిగి ఉన్న వారికి అన్నిరకాల పరీక్షలు చేశారు. సీఎస్‌సీ వైద్య బృందం సభ్యులు మాట్లాడుతూ...సీఎస్‌సీ హెల్త్ కేర్ ద్వారా ఆరోగ్య పరిస్థితులపై కార్డులు జారీ అవుతాయని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందించేందుకు కార్డు దోహద పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌సీ హెల్త్ కేర్ వైద్య బృందం దివ్య, శ్వేత, మమత, శ్రావణి, శ్రీనాథ్, సాయి కుమార్, నవ్య తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలకు ధ్వంసమైన కల్వర్టులు, వంతెనలు

## ఇబ్బందులు పడుతున్న ప్రజలు

హుజూరాబాద్‌రూరల్: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు ధ్వంసమయ్యాయి. ముఖ్యంగా కల్వర్టులు, బ్రిడ్జీలు దెబ్బతినడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. ఫలితంగా గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దెబ్బతిన్న రోడ్ల గుండా రాత్రి వేళ కొత్తవారు ఆదమరిచి ప్రయాణిస్తే అంతే సంగతులని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని జూపాక గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలోని కల్వర్టు బ్రిడ్జీ ఇటీవల దెబ్బతినడంతో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే ధర్మరాజుపల్లి గ్రామంలోని మల్లన్నకుంట మత్తడిపోయడంతో ధర్మరాజుపల్లి-ఉప్పల్ గ్రామాలకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతింది. హుజూరాబాద్, కమలాపూర్, ఉప్పల్‌కు వెళ్లాలంటే మార్గం షార్ట్ కట్ కావడంతో వ్యాపారులు, రైతులు వివిధ పనులకు ఈ మార్గం గుండా వెళ్లేవారు. ఇప్పుడు ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


ఉప్పల్-ధర్మరాజుపల్లికి వెళ్లే దారిలో దెబ్బతిన్న కల్వర్టు